క్లుప్తంగా

'రెవెన్యూ సేవలకు దరఖాస్తు చేసుకోండి'



తహసీల్దార్ రమణారావు

రావికమతం: అన్ని రకాల రెవెన్యూ సేవలకు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ రమణారావు తెలిపారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడారు. ఎన్నికల విధుల్లో భాగంగా గత మూడు నెలలుగా రెవెన్యూ సేవలలో కాస్త జాప్యం జరిగిందన్నారు. ఎన్నికలు సజావుగా ముగిసినందున ఇకపై అన్ని రకాల దరఖాస్తులను తక్షణం పరిష్కారిస్తామన్నారు. ఎన్నికలు ముగిసినా ఓట్ల లెక్కింపు వరకూ మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా ముగిసేందుకు అన్ని పార్టీల నాయకులు సహకరించాల్సిందిగా కోరారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన



రోగికి కంటి పరీక్ష చేస్తున్న వైద్యులు

గొలుగొండ: ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 90 మంది రోగులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 30 మందిని కంటి ఆపరేషన్ నిమిత్తం విశాఖకు తరలించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ ఉచిత శిబిరానికి ఏఎల్ పురంతో పాటు పాడి, రత్నంపేట, కొంకసింగి, లింగంపేట, కృష్ణదేవిపేట తదితర గ్రామాల నుంచి కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న రోగులు హాజరయ్యారు.

తోడపెద్దుకు ఘనంగా అంతిమ సంస్కారం



మృతిచెందిన తోడపెద్దును ఊరేగిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురంలో ఆదివారం సాయంత్రం మరణించిన వేగి వారి తోడ పెద్దు అంతిమ యాత్ర సోమవారం ఉదయం అధిక సంఖ్యలో భక్తులు వెంటరాగా ఘనంగా నిర్వహించారు. 17 ఏళ్లగా సేవలందించిన తోడపెద్దుకు వేగి అప్పలనాయుడు ఇంటి వద్ద ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు సింహాద్రప్పన్న సేవ చేశారు. అనంతరం జలాభిషేకం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. సింహాద్రప్పన్న ప్రతిరూపం తోడపెద్దు మృతి విషయం తెలుసుకున్న పరిసర గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో అంతిమ యాత్రలో పాల్గొన్నారు. వేద మంత్రోశ్చరణల మధ్య పాలగెడ్డ సమీపంలో ఖననం చేశారు. తోడపెద్దు సంరక్షకుడు దాసుడు వేగి హరికృష్ణ వేదన వర్ణనాతీతం.

ఇంగ్లిష్‌తో చదువులో రాణింపు



విద్యార్థులకు ఇంగ్లిష్ భాష ప్రాధాన్యతను వివరిస్తున్న గ్రంథాలయ అధికారి దమయంతి

నర్సీపట్నం: ఇంగ్లిష్‌లో పట్టు సాధిస్తే చదువులో రాణించవచ్చని గ్రంథాలయ అధికారి పి.దమయంతి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న సమ్మర్ క్యాంపులో భాగంగా సోమవారం ఇంగ్లిష్‌పై విద్యార్థులకు తర్ఫీదునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంగ్లిష్‌లో ప్రధానంగా టెన్సస్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. వీటిపై పట్టు సాధించడం ద్వారా ఇంగ్లిష్‌లో సులభంగా రాణించవచ్చన్నారు. రిసోర్స్‌పర్సన్ కృష్ణవేణి టెన్సస్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. గురజాడ అప్పారావు, ఇందిరా గాంధీ, మదర్ థెరీసా, భగత్‌సింగ్, నెహ్రూ, గాంధీల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయిస్తేనే గ్యాస్ రాయితీ

నాతవరం: ఈ నెల 31 లోపు గ్యాస్ వినియోగదారులంతా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని నాతవరం శ్రీనవ్య ఇండేన్ గ్యాస్ డీలరు చెక్కా తాతారావు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఇండేన్ గ్యాస్ కనెక్షన్లు ఉన్న వినియోగదారులంతా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

అంతరించిపోతున్న పేదవాడి పంకా



గ్రామాల్లో విక్రయిస్తున్న విసన కర్రలు



విక్రయానికి సిద్ధం చేసిన విసన కర్రలు

నాతవరం: ఒకప్పుడు పేదవాడి ఫ్యాన్‌గా భావించే విసన కర్రలు కనుమరుగవుతున్నాయి. వేసవి కాలం వచ్చిందంటే ప్రతి ఇంట్లో తాటాకులతో తయారు చేసిన విసన కర్రలు కనిపిస్తుండేవి. 1974కు ముందు నర్సీపట్నం రెవెన్యూ డివిజన్‌లో 20 శాతం గ్రామాలకు మాత్రమే విద్యుత్ సౌకర్యం ఉండేది. విద్యుత్ సదుపాయం ఉన్న చాలా మంది ఇంట్లో విద్యుత్‌తో తిరిగే ఫ్యాన్లు కన్పించేవి కాదు. ఆ రోజుల్లో ఎక్కడ చూసినా తాటాకుల విసన కర్రలతోనే జనాలు సేద తీరేవారు. దీంతో వీటి తయారీ వృత్తిగా పలువురు ఉపాధి పొందేవారు. కాలం మారుతున్న కొద్దీ మనుషులకు సౌకర్యాలు పెరిగాయి. ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల రాకతో విసన కర్రలు మూలకు చేరాయి. విద్యుత్ కోతల సమయంలోనైనా అక్కరకొచ్చే విసన కర్రలు ఇన్వర్టర్లు, బ్యాటరీతో తిరిగే ఫ్యాన్ల కారణంగా పూర్తిగా కనుమరుగవుతున్నాయి. కాలం మారుతున్నా.. కోటవురట్ల మండలంలో విసన కర్రలు తయారు చేసే కుటుంబంలో జన్మించిన రాంబాబు ఇప్పటికీ వాటి తయారీనే ఉపాధి మార్గంగా ఎంచుకున్నాడు. మండలంలో కొత్త ఎల్లవరం, డొంకాడ, యరకంపేట గ్రామాల్లో మండుటెండల్లో సైతం నడుకుంటూ వెళ్లి విసన కర్రలు అమ్ముతున్నాడు. కొంత మంది వృద్ధులు చిన్ననాటి స్మృతుల్ని గుర్తుంచుకుని వాటిని కొనుగోలు చేస్తున్నారు. చదువుకున్న యువత సరదా కోసం వాటిని తీసుకుంటున్నారు. ఒక్కో విసన కర్రను రూ.80 నుంచి 90 మధ్య విక్రయిస్తున్నట్టు రాంబాబు తెలిపారు.

ముందే వచ్చిన టెన్త్ పాఠ్య పుస్తకాలు



పాఠ్య పుస్తకాలను సర్దుతున్న సమాచార నిర్వహణ సమన్వయకర్త

రోలుగుంట: రానున్న విద్యా సంవత్సరానికిగాను ప్రభుత్వ స్కూళ్లలో చదివే టెన్త్ విద్యార్థులకు మారిన సిలబస్ మేరకు ఫిజిక్స్ మినహా మిగిలిన పాఠ్య పుస్తకాలు ముందుగానే వచ్చినట్లు మండల విద్యాశాఖాధికారి కె.జానుప్రసాద్ సోమవారం తెలిపారు. స్కూళ్లు తెరిచాక వీటిని విద్యార్థులకు ఉచితంగా సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. మండల పరిధిలోని 8 జెడ్పీ హైస్కూళ్లు, ఒక కేజీబీవీలో 340 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఒక్కొక్కరికి 11 పుస్తకాలు చొప్పున 3,740 పాఠ్యపుస్తకాలు వచ్చాయి. వీటిని సమాచార నిర్వహణ సమన్వయకర్త(ఎంఐసీవో) మడ్డు వేణు, అటెండర్ రామచంద్రతో కలసి క్రమ పద్ధతిలో పాఠశాలల వారీగా సర్ది పెట్టారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జానుప్రసాద్ మాట్లాడుతూ ఫిజికల్ సైన్స్ పాఠ్యపుస్తకాలు మాత్రమే రావాల్సి ఉందన్నారు.

గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత



చొడువాడలో పోలీస్ సిబ్బంది ర్యాలీలో పాల్గొన్న ఎస్‌ఐలు లక్ష్మీనారాయణ, రమేష్

కె.కోటపాడు: ఎన్నికల ఫలితాలు వచ్చేంత వరకు గ్రామాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని కె.కోటపాడు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ అన్నారు. చొడువాడలో పోలీస్ సిబ్బందితో కలిసి సోమవారం సాయంత్రం ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతల కల్పనకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణానికి విఘాతం కలిగించే వారికి క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎ.కోడూరు ఎస్‌ఐ రమేష్ పాల్గొన్నారు.

14 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలకు ప్రతిపాదన

మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి

రోలుగుంట: మండల రైతాంగం అవసరం మేరకు ఏటా మాదిరిగానే పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము విత్తనాల కోసం ఏపీ సీడ్స్‌కు ప్రతిపాదనలు పంపినట్లు మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత అంచనా మేరకు 14 క్వింటాళ్లకు ప్రతిపాదనలు పంపించామన్నారు. అందులో జీలుగ నాలుగు క్వింటాళ్లు, జనుము 10 క్వింటాళ్లు కలిపి మొత్తం 14 క్వింటాళ్ల విత్తనాలు రప్పిస్తున్నట్లు తెలిపారు. ఇవి కిలో రూ.88 కాగా రాయితీ 50 శాతం పోగా రూ.44కే అందిస్తామన్నారు. కావాల్సిన రైతులు తమ పేర్లను ఆర్బీకే సిబ్బంది వద్ద నమోదు చేయించుకుని, నగదు చెల్లించి రసీదు పొందవచ్చన్నారు.

వృద్ధులకు అన్నసమారాధన



వృద్ధులకు అన్నసమారాధన చేసిన ఆర్‌ఎంపీ వైద్యుడు సత్యారావు

బుచ్చెయ్యపేట: మండలంలోని పొట్టిదొరపాలెం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు వడి సత్యారావు వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించి, అన్న సమారాధన జరిపారు. సత్యారావు తన పుట్టినరోజు సందర్భంగా సోమవారం అప్పలరాజుపురంలోని వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులందరికి బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించారు. ఆశ్రమంలో ఉన్న వృద్ధులతో పాటు పలువురు బిచ్చగాళ్లకూ అన్నసమారాధన చేశారు. గత పదేళ్లుగా తన పుట్టిన రోజునాడు అభాగ్యులకు తన వంతుగా సాయపడుతున్నట్లు తెలిపారు.

ప్రజా ఉద్యమనేత పుచ్చలపల్లి



పుచ్చలపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

చీడికాడ: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా ఉద్యమనేతగా చరిత్రలో నిలిచిపోయారని సీపీఎం మండల కార్యదర్శి ఆర్.దేముడునాయుడు అన్నారు. సోమవారం పుచ్చలపల్లి వర్ధంతి సభను కోనాం శివారు కొండ్ల కొత్తూరులో నిర్వహించారు. ఈ మేరకు పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గజ్జాలమ్మ ఉత్సవానికి సన్నాహాలు



కన్నూరుపాలెంలో వెలసి ఉన్న గజ్జాలమ్మ వారు



గజ్జాలమ్మ ఆలయం



ఆలయ అలంకరణకు సిద్ధం చేస్తున్న పూలమాలలు

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం గ్రామంలో ప్రసిద్ధి చెందిన గజ్జాలమ్మ ఉత్సవం మంగళవారం పెద్ద ఎత్తున నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. రెండేళ్లకొకమారు ఇక్కడ అమ్మ వారి ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవం సందర్భంగా ఆలయాన్ని అందంగా పూలదండలతో అలంకరిస్తామని, అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయని, సాయంత్రం జాతర ఊరేగింపు జరుగుతుందని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. అమ్మ వారి ఆలయం నుంచి గ్రామంలోని సాయిబాబా ఆలయం వరకు విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. ఎన్నికల నిబంధనల దృష్ట్యా సాంస్కృతిక కార్యక్రమాలు ఈసారి ఏర్పాటు చేయలేదన్నారు.

వరాహలక్ష్మీ నృసింహుని జయంతికి ఏర్పాట్లు

అనకాపల్లి : స్థానిక గవరపాలెం దిబ్బవీధి శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవాలయంలో ఈనెల 22న వైశాఖ శుద్ధ చతుర్దశి స్వాతి నక్షత్రం నరసింహ జయంతిని పురస్కరించుకుని స్వామివారికి పంచామృతం అభిషేకాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ నిర్వాహకులు మళ్ల రామచంద్రరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదేరోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ స్వామివారికి 1008 తులసి దళాలలో ప్రత్యేక పూజ జరుగుతుందన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

నర్సీపట్నం: రైతు భరోసా కేంద్రాల్లో(ఆర్బీకే)రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి అప్పారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 11 ఆర్బీకేల్లో విత్తనాలు పంపిణీకి సిద్ధం చేశామన్నారు. కావాల్సిన రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకుని, రాయితీ మినహాయించి, మిగిలిన మొత్తాన్ని చెల్లించి విత్తనాలు పొందాల్సిందిగా సూచించారు. జనుం 10 కిలోల ధర రూ.880 కాగా సబ్సిడీపోను రూ.440కే అందిస్తున్నామన్నారు. రూ.880 విలువైన 10 కిలోల జీలుగు విత్తనాలు రూ.440, రూ.1,072 ఖరీదు చేసే 8 కిలోల పిల్లిపెసర విత్తనాలు రూ.536కు కొనుగోలు చేయవచ్చన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

కుండపోత వర్షం

గొలుగొండ: మండలంలో సోమవారం సాయంత్రం దాదాపు గంటసేపు కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షంతో మెరక పంటలైన చెరకు, సరుగుడు, కూరగాయలు, ఆయిల్‌పాం సాగుకు ఎంతో మేలు జరుగుతుందని రైతులు చెప్తున్నారు. ప్రధానంగా పశుగ్రాసం పెరిగి, పశువులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మండలంలో జోగుంపేట, గొలుగొండ, లింగంపేట, చిన్నయ్యపాలెం, కొత్తమల్లంపేట, అమ్మపేట, గింజర్తి తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది.

ఉత్సాహంగా వేసవి శిక్షణ



గ్రంథాలయంలో శిక్షణకు హాజరైన విద్యార్థులు

మాకవరపాలెం: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ ఉత్సాహంగా సాగుతోంది. నిత్యం ఈ శిబిరానికి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు. ఈ నెల 15 నుంచి ప్రారంభమైన ఈ శిబిరం వచ్చే నెల 7 వరకు కొనసాగుతుందని గ్రంథాలయ అధికారి చంద్రకళ సోమవారం తెలిపారు. శిబిరంలో కథలు, చిత్రలేఖనం, పుస్తక పఠనం తదితర అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

వేసవి శిబిరంలో చెస్ పోటీలు



చెస్ ఆడుతున్న విద్యార్థులు

రోలుగుంట: ఏటా మాదిరిగానే స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 15 నుంచి వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాల్లో భాగంగా సోమవారం చెస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి ఎస్.వరలక్ష్మి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలు మరింత విజ్ఞానం సముపార్జించేందుకు ఈ శిబిరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులతో చదవటం, రాయడం, చిత్రలేఖనం తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

గోవాలమ్మతల్లి పండగ నేడు



మునగపాకలోని గోవాలమ్మ తల్లి

మునగపాక: మండల కేంద్రమైన మునగపాకలో మంగళవారం గోమాలమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతి అయిదేళ్లకు ఒకసారి నిర్వహించే పండగను ఈ సారి కూడా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు సంఘ అధ్యక్షుడు బొడ్డేడ అప్పలనాయుడు తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకోవాలని కోరారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కశింకోట : కశింకోటలోని దేవదాయ శాఖకు చెందిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం వేద పారాయణ నిర్వహించారు. స్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆకాశం.. స్వర్ణ, రజత శోభితం



తొలి వేకువ స్వర్ణం



ఉదయ రజతం

ఆకాశం.. అంతులేని ఆనందానుభూతుల నిలయం. సప్తవర్ణ శోభితం. రావికమతం మండలంలోని కొత్తకోట గ్రామంలో సోమవారం తొలి వేకువ నుంచి ఉదయం వరకు ఆకాశం చూపరులను ఆనందంలో ముంచెత్తింది. తొలి వేకువన సూర్యుని ఆగమనాన్ని సూచిస్తూ కాస్త ముందుగా బయల్దేరిన కిరణాలతో మబ్బులు బంగారు వన్నెలద్దుకున్నాయి. ఉదయం 7 గంటల తర్వాత అవే మబ్బులు వెండి ముద్దలుగా మారాయి. స్వల్ప వ్యవధిలోనే బంగారు, వెండి వన్నెలతో ప్రకృతి ప్రేమికులకు ఆనందాన్నిచ్చాయి.

- రావికమతం

ఎన్నికల గొడవలో ఉన్న యువతకు కౌన్సెలింగ్



సర్కిల్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ అప్పలనాయుడు

రావికమతం: కొత్తకోట గ్రామంలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జరిగిన గొడవలో ఉన్న యువకులు, నాయకులకు కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. పోలింగ్ రోజున పోలీసులు వారిస్తున్నప్పటికీ వినకుండా కొందరు యువకులు పరస్పరం తగవుకు దిగడంతో, పోలీసులు వీడియో తీసి మందలించి వదిలేశారు. ఆ వీడియోలో ఉన్న యువకులతో పాటు వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు దేవా, సత్యనారాయణ, కృపారావులను సర్కిల్ కార్యాలయానికి పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికల సమయంలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించినా, వివాదాలు సృష్టించినా కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఎన్నికల కోడ్ సమయంలో కేసులు నమోదైతే సంవత్సరాల పాటు కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని, అనవసరంగా జీవితాలను బలి చేసుకోవద్దని హితవు పలికారు. జూన్ 4న కౌంటింగ్ సమయంలోనూ శాంతియుతంగా వ్యవహరిస్తామని వారి వద్ద హామీ తీసుకున్నారు. ముందస్తుగా వారందరినీ బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ లక్ష్మణరావు ఉన్నారు.

కిశోర బాలికల ఆరోగ్యంపై అదనపు శ్రద్ధ



కిశోర బాలికలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు: కిశోర బాలికలు రక్తహీనత బారిన పడకుండా ఉండేందుకు పౌష్టిక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.శైలజ అన్నారు. కొరువాడ జగన్నాథపురంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను నిర్వహించారు. 132 మందికి వైద్య సేవలందించారు. గర్భిణులకు, కిశోర బాలికలకు ఆరోగ్య తనిఖీలతో పాటు, పలు జాగ్రతలు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు ఆకుకూరలతో పాటు పప్పు దినుసులు ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం పార్వతి, ఎంఎల్‌హెచ్‌పీ గౌరి, హెల్త్ అసిస్టెంట్ నర్సింహమూర్తి పాల్గొన్నారు.

'విత్తనాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి'

మాకవరపాలెం: రాయితీ విత్తనాలకు రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏవో చిరంజీవి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ పచ్చిరొట్ట, వేరుశనగ విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందిస్తామన్నారు. ఈ విత్తనాలు కావాల్సిన రైతులు ఆయా సచివాయాల పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో ముందుగా పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



శ్రీను కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న యూత్ సభ్యుడు

బుచ్చెయ్యపేట: మండలంలోని రాజాం గ్రామంలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి గ్రామ యూత్ సంఘం అండగా నిలిచింది. ఈ నెల 16న రాజాంలో ప్రమాదవశాత్తు సంభవించిన అగ్ని ప్రమాదంలో గొర్లి శ్రీను ఇల్లు దగ్ధమైంది. కట్టు బట్టలతో కుటుంబ సభ్యులు రోడ్డున పడ్డారు. రాజాం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.33 వేల నగదును శ్రీను కుటుంబ సభ్యులకు సోమవారం అందించారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

దేవరాపల్లి: దేవరాపల్లి శాఖా గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఒ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలో పిల్లలు గీసిన బొమ్మలను ఉషోదయ ఉపాధ్యాయుడు కాటపల్లి సందీప్‌కుమార్ పరిశీలించి, విజేతలను ఎంపిక చేశారు. గెలుపొందిన పిల్లలకు ప్రశంసా పత్రాలు అందించారు.

జిల్లా కేంద్రంగా కుస్తీ క్రీడను అభివృద్ధి చేస్తా..



ఎం.వి.మాణిక్యాలరావును శాలువాతో సత్కరిస్తున్న క్రీడాకారులు

అనకాపల్లి : జిల్లాలో ఆసక్తి గల క్రీడాకారులకు రెజ్లింగ్(కుస్తీ) పోటీల్లో పాల్గొనేందుకు త్వరలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని అమెచ్యూర్ రెజ్లింగ్(ఒలింపిక్ వెయిట్ లిఫ్టర్) అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.మాణిక్యాలరావు అన్నారు. స్థానిక గవరపాలెం వి.వి.రమణ రైతు భారతిహాల్లో సోమవారం జిల్లా క్రీడాకారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంగా త్వరలో కుస్తీ పోటీల అసోసియేషన్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వాలు క్రీడాకారులకు ఎంతో ప్రోత్సహం అందిస్తుందని, విద్యార్థి దశ నుంచి క్రీడలపై ఆసక్తి పెంచుకునేలా దశల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ఎంతగానో ప్రోత్సాహం అందించిందన్నారు. ఆడుదాం ఆంధ్రా పేరిట రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన క్రీడా పోటీల ద్వారా ఎందరో యువ క్రీడాకారులు వెలుగులోకి వచ్చారని తెలిపారు. ఇదే స్ఫూర్తి కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు ఆళ్ల ప్రవీష్ కుమార్, శిలపరశెట్టి బాబి, దొడ్డి సంతోష్, ఎస్.హేమసాయి, గణేష్, హృదయ్, ప్రవల్లిక, సత్యనారాయణ పాల్గొన్నారు.